క్లుప్తంగా..

భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ఘట్‌కేసర్: ప్రతాపసింగారం గుబ్బరిగుట్ట మైసమ్మ, ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి దంపతులు, సర్పంచ్ శివశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్ పాల్గొన్నారు.

గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి



గౌడ సంఘ భవనం ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, బాలరాజ్‌గౌడ్

ఘట్‌కేసర్: గౌడకులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఏదులాబాద్‌లో నిర్మించిన గౌడ సంఘం నూతన భవనాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, స్థానిక శాఖ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సొంత నిధులతో భవనం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, స్థానిక శాఖ అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌కు పరామర్శ



తిరుమల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మురళీధర్‌రావు

కీసర: బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శి, చీర్యాల గ్రామ ఉప సర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డిని గురువారం బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు పరామర్శించారు. ఇటీవల తిరుమల్‌రెడ్డి తండ్రి జిల్లాల పెంటారెడ్డి అనారోగ్యకారణంగా మృతిచెందారు. ఈనేపథ్యంలో బీజేపీ నేతలు తిరుమల్‌రెడ్డిని కలిసి పరామర్శించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కీసర: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. గురువారం 8వ వార్డు ఇందిరమ్మ కాలనీ, ఎల్‌ఎన్‌ఆర్ కాలనీ గేట్ సమీపంలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్‌స్వామి, కౌన్సిలర్ సంపన్‌బోల్ స్వప్నహరిగౌడ్ పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించిన అధికారులు



ప్రహరీని కూల్చేస్తున్న అధికారులు

మేడ్చల్: మండలంలోని గౌడవెళ్లి గ్రామంలో ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. గ్రామ పరిధిలోని సుతారిచెరువు శిఖం భూమి లోరియల్ వ్యాపారులు అక్రమంగా నిర్మాణాలు చేశారు. దీంతో ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులు శిఖం భూమిలో ఉన్న ప్రహరీ, ఇతర నిర్మాణాలను యంత్రాల సహాయంతో గురువారం తొలగించారు.

కంపోస్టు ఎరువుల తయారీ అభినందనీయం

కాప్రా: వంటింటిలోని వ్యర్థాలతోపాటు చెట్ల ఆకులతో కంపోస్టు ఎరువుల తయారీ విధానం అభినందనీయమని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ అన్నారు. కాప్రా డివిజన్ సాకేత్ కాలనీలో స్థానిక కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు కంపోస్టు ఎరువుల తయారీని ప్రారంభించారు. 10 కంపోస్టు పిట్‌లు ఏర్పాటు చేసి కాలనీలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల ఆకులను, వంటింటిలోని వృథా పదార్థాలతో ఎరువులు తయారు చేస్తున్నారు. కాలనీలో ఉన్న స్థానికులు వారి ఇళ్లలోని వ్యర్థాలను స్వచ్ఛందంగా తీసుకొచ్చి ఈ కంపోస్టు పిట్‌లలో వేసివెళ్తుంటారు. ఇక్కడ తయారైన ఎరువులను కాలనీలోని పార్కులలో చెట్లకు వేస్తున్నారు.

అక్రమార్కులను వణికించి... అభాగ్యులకు అండగా నిలిచి..

● సాక్షి కథనాలతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల్లో కదలిక ● సామాన్యులకు, విద్యార్థులకు బాసటగా..

అక్రమాలకు పాల్పడే వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించి, అభాగ్యులకు అండగా నిలవడంలో సాక్షి దినపత్రిక ముందువరుసలో నిలిచింది. సాక్షిలో ప్రచురితమైన పలు కథనాల కారణంగా ఉన్నతాధికారులు ఓ సర్పంచ్‌తో పాటు గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతోపాటు పలు సమస్యలను పరిష్కరించారు. - మేడ్చల్ రూరల్

విద్యార్థుల సమస్యకు పరిష్కారం



విద్యార్థుల సమస్యల పరిష్కారంలోనూ సాక్షి ముందుంది. 2018 మార్చి నెలలో మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యుత్ బిల్లు చెల్లించలేదని కరెంట్ సరఫరా నిలిపివేశారు. మార్చి 9న సాక్షి దినపత్రికలో 'సర్కారు బడికి విద్యుత్ కష్టాలు' అనే శీర్షికను ప్రచురించగా వెంటనే స్పందించిన నాటి జిల్లా కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఒక్కరోజు గడవకముందే విద్యుత్ సరఫరా తిరిగి ప్రారంభించారు.



దారికొచ్చిన విద్యుత్ సిబ్బంది




మండలంలో విద్యుత్ శాఖ పనితీరు, సిబ్బంది చేతివాటాన్ని వెలికితీస్తూ 2023 జనవరి 20వ తేదీన 'కరెంట్ శాఖలో కాసుల కక్కుర్తి' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సిబ్బందికి మొటిక్కాయలు వేసారు. అప్పటినుంచి వారి పనితీరులో మార్పు రావడంతో సాక్షి కథనం వల్లే తమకు ఇబ్బందులు తొలగాయంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఏకంగా సర్పంచ్‌పైనే వేటు



మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, గ్రామ కార్యదర్శి విజయ్‌కుమార్ ఏకమై అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రామంలో ఉన్న 12 వేల గజాల గ్రామ కంఠం భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమిని అక్రమార్కుల పరం చేస్తూ వాటికి గ్రామ పంచాయతీ సర్టిఫికెట్ జారీ చేసి రూ.కోట్ల రూపాయలు దండుకునేందుకు యత్నించారు. ఈ విషయాన్ని 2021 డిసెంబర్ 23వ తేదీన సాక్షి దినపత్రికలో 'అంతా మా ఇష్టం' పేరుతో కథనం ప్రచురింతమైంది. ఈ కథనానికి జిల్లా స్థాయిలో అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ఈ విచారణలో గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, గ్రామ కార్యదర్శి విజయ్‌కుమార్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు తేలడంతో సరిగ్గా నెల రోజులకు అంటే 2022 జనవరి 23న జిల్లా కలెక్టర్ వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమార్కుల చేతిలోకి వెళ్లిన గ్రామ కంఠం స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. దీంతో సాక్షి కథనంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ముంపు సమస్యకు చెక్





మండలంలోని పూడూర్ పాఠశాల మైదానం లోతట్టుగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడల్లా సమీప కాలనీల నీళ్లు సర్కార్ బడిలోకి చేరి చెరువుగా మారుతుండేది. వానొచ్చే వరదొచ్చే అనే శీర్షికతో పాఠశాల మైదానం సమస్యను ప్రతిబింబించేలా కథనం ప్రచురించడంతో స్పందించిన అధికారులు, గ్రామ పాలకవర్గం మైదానంలో మట్టిపోసి వర్షపునీరు నిలవకుండా చదును చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు సాక్షి దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి కథనంతో పాఠశాల రూపురేఖలు మారాయి



ప్రభుత్వ పాఠశాలలో వర్షం వచ్చిందంటే చాలు మైదానంలో నీళ్లు నిలిచి చెరువులా కనిపించేది. సమస్యపై సాక్షిలో కథనం రావడంతో సమస్య పరిష్కారమైంది. పాఠశాల ఆవరణను మట్టితో చదునుచేసి నీరు నిలవకుండా చేయడంతో పాటు ఇటీవల సెహగల్ ఫౌండేషన్ వారు పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ప్రత్యేక కథనంతో విద్యార్థుల సమస్యను తొలగించినన సాక్షి దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు.

- శ్రీకాంత్, వార్డు సభ్యుడు పూడూర్

నిజాలను నిర్భయంగా వెలికి తీస్తున్న సాక్షి



నిజాన్ని నిర్భయంగా వెలికితీసి తమ కథనాలతో సాక్షి పత్రిక అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఇటీవల విద్యుత్ శాఖ సిబ్బంది తీరును కళ్లకు కట్టేలా ప్రచురించడం అభినందనీయం. ఆ కథనంతో సిబ్బంది తీరులో మార్పు వచ్చింది. ఇలాంటి మరెన్నో కథనాలను ప్రచురించాలని కోరుకుంటున్నా.

- నరేశ్, మేడ్చల్

సర్పంచులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు



డబీల్‌పూర్ సర్పంచ్ గీతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే గ్రామాలలో ప్రజలకు ఉత్తమ పాలన అందుతోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సత్ వికాస్ పురస్కార్ లో ఎంపికైన గ్రామాలకు ఆయన అవార్డులు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సర్పంచ్‌లకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. మండలంలోని డబీల్‌పూర్, రాజబొల్లారం, మైసిరెడ్డిపల్లి, రాయిలాపూర్, రావల్‌కోల్, సైదోనిగడ్డంతండా, పూడూర్, నూతన్‌కల్, గౌడవెళ్లి, రాజబొల్లారం తండా, ఎల్లంపేట్, కోనాయిపల్లి, సోమారం, మునీరాబాద్, లింగాపూర్, నూతన్‌కల్, బండమాదారం, శ్రీరంగవరం గ్రామాలు వివిధ అంశాలలో అవార్డులు సాధించాయి.



నివాళులర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్‌కు నివాళి

శామీర్‌పేట్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయాంజాల్‌లో వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన పోరాటాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మున్సిపాలిటీ కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛతపై అవగాహన

మేడ్చల్: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత-2023 అవార్డుల దరఖాస్తుల స్వీకరణపై మున్సిపల్ ఆర్పీలకు మున్సిపల్ కార్యాలయంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీలతోకలిసి మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్, ప్రియాంక పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం.. వాచ్‌మెన్ మృతి

ఘట్‌కేసర్: డీసీఎంను డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో దానికింద నిద్రిస్తున్న వాచ్‌మెన్ మృతి చెందాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. యాదాద్రి జిల్లా సైదాపూర్‌కు చెందిన గ్యార చంద్రయ్య (53) ఘట్‌కేసర్ పట్టణంలోని ఓ గ్యారేజీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. చంద్రయ్య బుధవారం రాత్రి గ్యారేజ్‌లో పార్కింగ్ చేసిన డీసీఎం కింద నిద్రపోయాడు. అయితే.. కొద్ది సమయం తర్వాత డీసీఎం డ్రైవర్ రంగారెడ్డి.. చంద్రయ్యను గమనించకుండా వ్యాన్‌ను నడిపాడు. దీంతో దీంతో నిద్రపోతున్న చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. దీంతో వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వ్యాచ్‌మెన్ చంద్రయ్య మృతదేహం

అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నాచారం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ అనసూయ ఆధ్వర్యంలో గురువారం పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యానికి పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేకు పలువురి జన్మదిన శుభాకాంక్షలు

ఘట్‌కేసర్: దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. ఎంపీటీసీ శోభారాణి, మహిపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

శామీర్‌పేట్: శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. జనగామ జిల్లా కు చెందిన కొరిమి బాలనర్సింహ గురువారం తుర్కపల్లి మల్లన్న జాతరలో పాల్గొనేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నాడు. వెంకటేశ్వర వీల్‌కేర్ సమీపంలో వెనుకనుంచి అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బాలనర్సింహను ఢీ కొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజ్ పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీ నగర్ ఒకటో వార్డులో జెట్టింగ్ మిషన్ ద్వారా స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి గురువారం పైపులైన్, మ్యాన్ హోల్స్‌ను శుభ్రం చేయించారు. కొద్ది రోజులుగా నెలకొన్న ఈ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెక్షన్ ఇన్‌చార్జ్ రాకేశ్, యాదయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మైనంపల్లికి కృతజ్ఞతలు

గౌతంనగర్: సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ నుంచి ఏఓసీ మిలటరీ రోడ్డు కొంతకాలంగా గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారు కావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి వాహనదారులు, ప్రజలు తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత మిలటరీ అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సంఘటితంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో మా గృహలక్ష్మీ సేవా సంఘం కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళదామన్నారు. పని ప్రదేశాలలో జరిగే వేధింపులకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలన్నారు. అనంతరం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నేతలు మెరుగు పుణ్యవతి, షేక్ షావలి పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ



ఘట్‌కేసర్: తెలంగాణ ఉద్యమకారుడు, ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ మాతృమూర్తి అబ్బసాని ఎల్లమ్మ ఇటీవల మరణించారు. దీంతో మంత్రి మాల్లారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ దయాకర్‌రెడ్డితో కలిసి గురువారం కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శం

కీసర: రాష్ట్రంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం కీసర మండల కార్యాలయంలో జరిగిన జాతీయ గ్రామపంచాయతీ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగించారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రాకుంటే సమస్యల పరిష్కారం ఎలా?

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

శామీర్‌పేట్: అధికారులు గైర్హాజరైతే సమస్యలు ఎవరికి వివరించాలని పలువురు సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. గురువారం మూడుచింతలపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు గ్రామాల్లోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఈ సభ నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు.

- పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఎంపీటీసీలు కోరారు.
- వేసవి కాలం మొదలవడంతో గ్రామాల్లో విద్యుత్, నీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు.
- అనంతరం శానిటేషన్, నర్సరీ నిర్వహణ మెరుగ్గా ఉన్న గ్రామ పంచాయతీలకు అవార్డులను అందజేసి, అధికారులను సన్మానించారు.
- కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ వత్సలదేవి, తహసీల్దార్ వాణిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్

ఘట్‌కేసర్: పంచాయతీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్ అన్నారు. కొర్రెముల్ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి కవిత అధ్యక్షతన గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో గ్రామాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలు పెంచుకోవాలని, గతంలో నాటి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ వినోద, వార్డు సభ్యులు ఆంజనేయులు, ఈశ్వరి, దుర్గారాజ్, భార్గవి, సునిత, భాస్కర్, బాబు, స్వామి, సుష్మ, లక్ష్మీ, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ శ్రమ్-కార్డు లబ్ధిదారుల వివరాల నమోదు



లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గంగపుత్ర సంఘం భవనంలో గురువారం ఈ శ్రమ్-కార్డులు, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల వివరాలు నమోదు చేయించారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వీస్ చార్జీలు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెల్లిస్తామన్నారు. పేదల కోసం కేంద్రం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రామోజీ, గ్రామ శాఖ అధ్యక్షుడు కుమార స్వామి పాల్గొన్నారు.